వానొస్తే ప్రయాణికులకు ఇక్కట్లే !

- రాయికల్‌లో బస్‌షెల్టర్ కరువు
- షెల్టర్ నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు
- ఇంతవరకూ ప్రతిపాదనలు పంపించని పాలకవర్గం



వర్షం కురిసి చిత్తడిగా మారిన రాయికల్ పాత బస్టాండ్ ప్రాంతం



దుకాణాల వద్ద వేచి చూస్తున్న ప్రయాణికులు

రాయికల్: పట్టణంలోని పాతబస్టాండ్‌లో ప్రయాణికుల కోసం బస్‌షెల్టర్ నిర్మించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్న చినుకు కురిస్తే బస్టాండ్ ప్రాంగణమంతా చిత్తడిగా మారుతోంది. ప్రయాణికులకు నిల్వ నీడ లేక అవస్థలు పడుతున్నారు. రాయికల్ పట్టణం, మండలంలోని 32 గ్రామాలకు చెందిన ప్రజలు కోరుట్ల, జగిత్యాల, నిర్మల్, మెట్‌పల్లి వెళ్లాలంటే రాయికల్ పాత బస్టాండ్ నుంచి బస్సు లెక్కి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రాయికల్ మున్సిపల్‌గా మారినప్పటికీ పాత బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఏలాంటి బస్‌షెల్టర్ నిర్మించకపోవడంతో ప్రయాణికులు వర్షం కురిస్తే పక్కనున్న షాపుల్లోకి వెళ్లి కూర్చునే పరిస్థితి నెలకొంది. దీంతో దుకాణ యజమానులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్‌షెల్టర్ నిర్మించాలని ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేదు. కొన్ని రోజుల క్రితం కోరుట్ల, జగిత్యాల డిపో మేనేజర్లు వచ్చి సర్వే చేసినప్పటికీ బస్‌షెల్టర్లకు సైతం మోక్షం కలగడం లేదు.

ఎస్‌సీసీఎల్ కింద రూ.30 లక్షలు మంజూరు..

రాయికల్ పట్టణంలో బస్‌షెల్టర్, ఓపెన్ జిమ్ కోసం రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు స్వయంగా సింగరేణి ఎండీ శ్రీధర్‌ను కలిసి ప్రయాణికుల సమస్య వివరించగా స్పందించిన ఎండీ ఎస్‌సీసీఎల్ పథకం కింద రూ.30 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో పట్టణంలో బస్‌షెల్టర్, ఓపెన్ జిమ్, పార్క్ వంటి అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయగా ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. మున్సిపల్ అధికారులు సంబంధిత అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు పంపించాల్సి ఉండగా తీవ్రంగా జాప్యం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, కమిషనర్ సంతోష్‌కుమార్ స్పందించి అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు పంపించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వర్షం పడితే ఇబ్బంది



వర్షం కురిస్తే పాతబస్టాండ్‌లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా బస్టాండ్‌లో ఎలాంటి మౌలిక వసతులు లేకపోవడంతో పరిసర ప్రాంతాల్లోని దుకాణాల్లోకి వెళ్లి బస్సుల కోసం ప్రయాణికులు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.

– శ్రీనివాస్, రాయికల్ పట్టణవాసి

నిధులు మంజూరు



రాయికల్ మున్సిపాలిటీలో సీఎండీ శ్రీధర్ చొరవతో రూ.30 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో పాత బస్టాండ్‌లో బస్‌షెల్టర్, ఓపెన్ జిమ్ వంటి పనులకు ప్రాధాన్యత ఇచ్చి అతి త్వరలోనే ప్రతిపాదనలు పంపి ఆమోదింపజేసుకుంటాం.

– మోర హన్మండ్లు, మున్సిపల్ చైర్మన్

అంబేడ్కర్ విగ్రహాలకు జీపీ కార్మికుల వినతి





ఇబ్రహీంపట్నం, రాయికల్‌లో అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్మికులు

మల్యాల: తమ డిమాండ్లు నెరవేర్చాలని దీక్ష చేపట్టిన గ్రామ పంచాయతీ కార్మికులు మంగళవారం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నిరసన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితం గడుపుతున్నామని, వేతనాలు పెంచడంతోపాటు, ఉద్యోగ భద్రత కల్పించాలని, పనికి తగిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి ఆదుకోవాలని పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీ సిబ్బంది సంఘం మండల అధ్యక్షుడు మగ్గిడ్డ జగన్, ఉపాధ్యక్షుడు అనంతకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లాపూర్: గ్రామ పంచాయతీ కార్మికులు, ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ మండల అధ్యక్షుడు తిప్పనవేని సుధాకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి కార్మికులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గడచంద శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.

రాయికల్: పంచాయతీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె మంగళవారం ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బత్తుల రాజేందర్, దొంతి రాజేందర్, మహిపాల్, జలేందర్, సంపూర్ణ, స్వరూప, రంగారెడ్డి, కిశోర్, అంజి పాల్గొన్నారు.

గొల్లపల్లి: గ్రామపంచాయతీ కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెలో భాగంగా మంగళవారం ఆరో రోజు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి తమ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు జంగిలి ఎల్లయ్య, సీహెచ్.రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తుందని నిరసిస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు మంగళవారం సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాలను సమర్పించారు.

క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న మంత్రి ఈశ్వర్

పెగడపల్లి: మండలంలోని వెంగళాయిపేట గ్రామానికి చెందిన మాదం రాజేందర్‌కు మంజూరైన రూ. 52 వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం మంత్రి కొప్పుల ఈశ్వర్ అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం బాధితుడు మంత్రిని కలిసి విన్నవించుకున్నాడు. ఈ మేరకు మంజూరైన చెక్కును మంత్రి కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు సాగి శ్రీనివాస్‌రావు, ఉప సర్పంచ్ మధుకర్ పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యేల చిత్రపటాలకు జలాభిషేకం



జలాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు

కథలాపూర్: మండలంలోని దూలూర్ గ్రామ శివారులో నాగమల్లప్పకుంట వద్ద సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే రమేశ్‌బాబు చిత్రపటాలకు మంగళవారం రైతులు జలాభిషేకం చేశారు. కాళేశ్వరం నుంచి వరదకాలువ రివర్స్ పంపింగ్ వల్ల నాగమల్లప్పకుంట పూర్తిగా నిండి మత్తడి దుంకుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగం భూమయ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ గుండారపు సౌజన్య, నల్ల గంగాధర్, మిట్టపెల్లి గంగారెడ్డి, మేడిపెల్లి రాజారెడ్డి, గుండారపు గంగాధర్, కుంభం మహేశ్, అల్వాల గణేశ్, పోచయ్య, శివరాం, అరుణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సత్తమ్మ

ధర్మపురి: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఇళ్ల సమీపంలో వర్షాకాలంలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని నీరు నిల్వ ఉన్నచోట నీటిని వెళ్లడానికి చర్యలు తీసుకోవాలని, నీరు ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్ చల్లాలని ముఖ్యంగా టైర్లలో, ప్లాస్టిక్ బాటిళ్లు, కూలర్లు, తాగి పడేసిన కొబ్బరి బొండాల్లో దోమలు చేరే అవకాశం ఉంటుందని వీటిని తొలగిస్తే వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ రమేశ్, మేనేజర్ గంగాధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, ఆర్పీలు పాల్గొన్నారు.


పారిశుధ్య పనులపై దృష్టి సారించాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

రాయికల్: పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ అన్నారు. మంగళవారం రాయికల్ మండలం భూపతిపూర్‌లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండటంతో గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఆయన వెంట సర్పంచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న డీసీఎంఎస్ చైర్మన్



పూజలు చేస్తున్న శ్రీకాంత్ రెడ్డి

ధర్మపురి: మండలంలోని రాజారం ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట జైనా పీఏసీఎస్ చైర్మన్ సొల్లు నరేశ్, సర్పంచ్ పులిశెట్టి మల్లేశం, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

అనుమతి లేకుండా ఫెస్టిసైడ్స్ విక్రయిస్తే చర్యలు



మల్లాపూర్ ఫర్టిలైజర్ షాప్‌లో తనిఖీ చేస్తున్న ఏవో

మల్లాపూర్: అనుమతి లేకుండా ఫెస్టిసైడ్స్‌ను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో లావణ్య హెచ్చరించారు. మంగళవారం మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు రత్నాపూర్ గ్రామాలో సహకార సంఘం, ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. రైతులు లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేయాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీ చేసిన ఎరువుల నమునాలను హైదరాబాద్ ల్యాబ్‌కి పంపిస్తున్నట్లు తెలిపారు. ఏఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

కోరుట్లరూరల్: మండలంలోని పైడిమడుగు, మాదాపూర్ సహకార సంఘాల్లోని ఎరువుల గోదాములను మండల వ్యవసాయ అధికారి నాగమణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నమూనాలను సేకరించి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు. కార్యాలయాల్లో ఎరువుల రికార్డులను పరిశీలించారు. రైతుల కోసం మండలంలోని అన్ని దుకాణాల్లో ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు లైసెన్సు ఉన్న దుకాణాల్లోనే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసి తప్పనిసరిగా రసీదు పొందాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో,తదితరులు పాల్గొన్నారు.

'డ్రమ్ సీడర్' సాగుతో రైతులకు మేలు



డ్రమ్ సీడర్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మల్యాల: డ్రమ్ సీడర్‌తో నాట్లు వేస్తే కూలీల ఖర్చు తగ్గడంతోపాటు, దిగుబడి పెరుగుతుందని ఏఈవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తాటిపల్లిలో మంగళవారం డ్రమ్ సీడర్ల ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించారు. డ్రమ్ సీడర్‌తో సాగుచేస్తే కూలీల ఖర్చు తగ్గుతుందని, దిగుబడి పెరుగుతుందని తెలిపారు. పదిరోజుల ముందే పొలం కోతకు వస్తుందన్నారు. మండలంలో అద్దె ప్రాతిపదికన డ్రమ్ సీడర్లు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బింగి జ్యోత్స్న రైతులు ఓరుగంటి సతీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అద్దెకు డ్రమ్‌సీడర్లు

జగిత్యాలరూరల్: రైతులు వరిసాగు కోసం డ్రమ్ సీడర్లను అద్దెకు ఇవ్వనున్నట్లు ఏఈవో వరుణ్ అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం పొరండ్లలో రైతులకు అద్దె ప్రతిపాదికన డ్రమ్ సీడర్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అధిక పెట్టుబడితో వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేయకుండా డ్రమ్ సీడర్ విధానం వరిసాగు కోసం దినసరి చొప్పున అద్దెకిస్తున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సారంగాపూర్: ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై తిరుపతి అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని పెంబట్లలో సైబర్‌నేరాలు, గుడుంబా, గంజాయి, సంఘవ్యతిరేక కార్యకలాపాలపై ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ కొంత మంది ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సైబర్‌నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ఎవరు కోరినా ఓటీపీ నెంబర్‌ను, మన బ్యాంకు వివరాలను, వ్యక్తిగత వివరాలను చెప్పకూడదని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు పల్లి రాజన్న, విండో చైర్మన్ గుర్నాథం మల్లారెడ్డి, ఉపసర్పంచ్ తోట లక్ష్మీ, గ్రామస్తులు ఉన్నారు.

ఘనంగా శీత్లాభవాని వేడుకలు



అడవి దేవుళ్లకు పూజలు చేస్తున్న గిరిజనులు

కథలాపూర్: మండలంతోని అంబారిపేట, భూషణరావుపేట, ఇప్పపెల్లి గిరిజన తండాల్లో మంగళవారం శీత్లా భవాని వేడుకలు గిరిజనులు వైభవంగా నిర్వహించారు. ఈ ఏటా వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, పశువులు ఆరోగ్యంగా ఉండి సిరులు కురిపించాలని దేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. అడవి దేవుళ్లకు మేకలను బలిఇచ్చారు. ఉత్సవాల్లో గిరిజన సంఘం మండలాధ్యక్షుడు గుగ్లోత్ రవినాయక్, ఏఎంసీ డైరెక్టర్ లవుడ్యా నరేశ్, చిన్నయ్య, రాజు, పూల్‌సింగ్, బన్నినాయక్, లచ్చిరాంనాయక్ గిరిజన నాయకులు పాల్గొన్నారు.

శీత్లా భవాని వేడుకల్లో 'అడ్లూరి'

పెగడపల్లి: మండలంలోని ఏడుమోటలపల్లి తండాలో బంజారాలు వైభవంగా జరుపుకున్న శీత్లా భవాని పండుగ వేడుకల్లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మన్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన శీత్లా భవాని దేవతను గూడెంలోని ప్రజలంతా కలిసి సంప్రాదాయకంగా జరుపుకోవడం వారి ఐక్యతను చాటి చెప్తుతుందన్నారు. అనంతరం స్థానికులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచి రవినాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు మల్లారెడ్డి, మల్లేశం, పవన్‌రెడ్డి, హరిలాల్ నాయక్, పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి గ్రామస్తుల సన్మానం

ఇబ్రహీంపట్నం: మండలంలోని డబ్బా ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా ఎంపికైన మనోజ్‌కుమార్‌ను సర్పంచ్ లింగపల్లి గంగాధర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి రాణి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సత్యానారాయణ, లింగయ్యస్వామి, రాజ్‌కుమార్, ప్రసాద్, అంగన్‌వాడీ టీచర్ సుందరగిరి గంగమ్మ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బాడీ ఫ్రీజర్ వితరణ

కథలాపూర్: మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ భైర దేవ్‌యాదవ్ మంగళవారం గ్రామానికి బాడీ ఫ్రీజర్ వితరణ ఇచ్చారు. తన పుట్టినరోజు సందర్భంగా రూ. 70 వేలు వెచ్చించి బాడీ ఫ్రీజర్ కొనుగోలు చేసి గ్రామపంచాయతీకి అప్పగించారు. మృతదేహాలను భద్రపరిచేందుకు వీలుగా బాడీ ఫ్రీజర్‌ను అందించినట్లు దాత దేవ్‌యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేవ్‌యాదవ్‌ను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగం భూమయ్య, సర్పంచ్ భైర హేమలత, ఎంపీటీసీలు బొడ్డు బాలు, మల్యాల రమేశ్, భైర మల్లేశం, యువకులు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుడికి ఎల్‌వోసీ అందజేత

కథలాపూర్: మేడిపెల్లి మండలం పోరుమల్ల గ్రామానికి చెందిన మాసం లింగారెడ్డి అనే గల్ఫ్ కార్మికుడి వైద్యం కోసం రూ. 2.50 లక్షల ఎల్‌వోసీని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంజూరు చేయించినట్లు నాయకులు మంగళవారం తెలిపారు. మాసం లింగారెడ్డి సౌదీ అరేబియా దేశంలో డ్రైవర్‌గా పనిచేసేవారు. వెన్ను నొప్పి సమస్యతో బాధపడుతుంటే ఆపరేషన్ కోసం డబ్బులు అవసరమయ్యాయి. తెలంగాణ జాగృతి దోహఖత్తార్ అధ్యక్షురాలు నందిని అబ్బగొని ద్వారా ఎమ్మెల్సీ కవితను సంప్రదించారు. హైదరాబాద్‌లో నిమ్స్‌లో ఆపరేషన్ కోసం రూ. 2.50 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారని నాయకులు పేర్కొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు



జగిత్యాల టౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకమైన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని బీజేపీ జిల్లా నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి, నాయకులు హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కిషన్‌రెడ్డిని కలిసిన వారిలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రెంటం జగదీశ్, బీర్పూర్ మండల అధ్యక్షుడు మ్యాడ జనార్దన్, ప్రధాన కార్యదర్శులు ఆడెపు రమేశ్, అప్పాల జలంధర్, కిసాన్‌మోర్చా పరిశోధన విభాగం కన్వీనర్ వేముల కరుణాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

మెట్‌పల్లి: వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరాపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై బీఆర్ఎస్ నాయకులు మంగళవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, నాయకులు బోయిన్‌పల్లి చంద్రశేఖర్‌రావు, సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జరుపుల భారతి, లింగంపల్లి సంజీవ్, పుల్లా జగన్, గజం రవి, ఆకుల ప్రవీణ్ తదితరులున్నారు.

మల్యాల: రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వొద్దన్నాడని ఆరోపిస్తూ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు అంగడిబజార్‌లో దహనం చేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ నాయకులు నినాదాలు చేశారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు 24గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తూ రైతులను ఆదుకుంటుంటే రైతు వ్యతిరేకి రేవంత్‌రెడ్డి ఉచిత విద్యుత్ ఇవ్వొద్దనడాన్ని ఖండిస్తున్నామన్నారు.

రైతు బీమాకు దరఖాస్తుల స్వీకరణ

ధర్మపురి : మండలంలోని వివిధ గ్రామాల్లో కొత్తగా పట్టా పాస్‌బుక్‌లు మంజూరైన రైతులు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏడీఏ రాంచంద్రం తెలిపారు. 18-6-2023 వరకు కొత్తగా పట్టా పాసుబుక్‌లు వచ్చిన వారు లేదా ఇప్పటి వరకు రైతుబీమాకు దరఖాస్తులు చేసుకోలేని రైతులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఆయా గ్రామాల రైతులు జూన్ 18, 2023 నాటికి కొత్తగా పట్టాపాస్‌బుక్ పొందినవారు, ఇంతవరకు రైతు బీమా కొరకు దరఖాస్తు చేసుకోని రైతులు బీమా కోసం దరఖాస్తు చేసుకొవాలని మండల వ్యవసాయ అధికారి దీపిక మంగళవారం తెలిపారు. 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల లోపు వారు ఆగస్టు 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

మల్యాల: మండలంలో నూతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతుభీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.చంద్రదీపక్ తెలిపారు.

పెగడపల్లి: 18 జూన్ 2023 వరకు కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొంది 18 నుంచి 59 ఏళ్లలోపు ఉన్న రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఏఈవో అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సారంగాపూర్: రైతుబీమాకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని బీర్‌పూర్ మండల వ్యవసాయాధికారి అనూష అన్నారు. కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు బీమా సౌకర్యం పొందడానికి దరఖాస్తులు ఆగస్టు 5లోపు సమర్పించాలని సూచించారు.

వెల్గటూర్: రైతుబీమా కోసం రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఏఈవో వినోద్ తెలిపారు. 18 నుంచి 59 ఏళ్లలోపు ఉన్న రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

రైతులకు రాయితీ విత్తనాలు పంపిణీ

కథలాపూర్: ప్రభుత్వం అందించే ఉచిత కంది విత్తనాలను రైతులు వినియోగించుకోవాలని జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు కోరారు. మంగళవారం భీమారం మండలం దేశాయిపేటలో రైతులకు వందశాతం రాయితీపై కంది విత్తనాలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన రమేశ్‌గౌడ్ అనే రైతు ఇటీవల మృతిచెందగా, అతని భార్య లావణ్యకు రైతుబీమా పథకం కింద మంజూరైన రూ. 5 లక్షల ప్రొసీడింగ్ కాపీని అందించారు. కార్యక్రమంలో ఏవో త్రివేదిక, సర్పంచ్ నాంచారి స్వప్న, వైస్ ఎంపీపీ దొంతి శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా నిలుస్తాం

మల్లాపూర్: బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా నిలుస్తామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని రాఘవపేటలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్ నాన్నమ్మ మృతి చెందగా, మంగళవారం ఆయనను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు కాటిపెల్లి ఆదిరెడ్డి, నత్తి నర్సయ్య, దేవారెడ్డి, బైరి రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కేజీవీల్స్‌తో ట్రాక్టర్లు రోడ్లపై నడిపితే చర్యలు

గొల్లపల్లి: మండలంలోని గ్రామాల్లో ట్రాక్టర్లు కేజీవీల్స్‌తో రోడ్లపై నడిపితే చర్యలు తప్పవని ఎస్సై అన్నారు. వీజీవీల్స్‌తో నడపడంతో రోడ్లు ధ్వంసం కావడంతో పాటు, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు గమనించి రోడ్లపై కేజీవీల్స్‌తో నడపకూడదని సూచించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని కార్మికుల ఆందోళన

మెట్‌పల్లి: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికులు అందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులతో పాటు పెంచిన ప్రకారం వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు కూన సరస్వతీ, సులోచన, సాలమ్మ, లక్ష్మి, గంగు, శారద, మల్లు తదితరులున్నారు.

గడపగడపకూ జనసేన

రాయికల్: గడపగడపకు జనసేన పార్టీని తీసుకెళ్లడమే ధ్యేయమని జగిత్యాల జిల్లా ఇన్‌చార్జి బెక్కం జనార్దన్ అన్నారు. మంగళవారం రాయికల్ పట్టణంలో శివాజీ విగ్రహం నుంచి గాంధీ విగ్రహం, పాత బస్టాండ్‌లో గడపగడపకు వెళ్తూ జనసేన పార్టీ సిద్ధాంతాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు పడాల ప్రసాద్‌గౌడ్, వినయ్, గంగం అజయ్, చిట్టి, మండల అధ్యక్షుడు మల్లిఖార్జున్, ప్రధాన కార్యదర్శి బత్తిని బాబు, ఉపాధ్యక్షుడు పొన్నం రాకేశ్, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

రాయికల్: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మండలంలోని ఇటిక్యాలలో బుధవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సామల్ల లావణ్య, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కొమ్ముల ఆదిరెడ్డి, ఉపాధ్యక్షుడు అంజిరెడ్డి, కోశాధికారి ప్రవీణ్, హెచ్ఎం శేఖర్ పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

రాయికల్: పట్టణంతో పాటు మండలంలోని 32 గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరు నమోదు కోసం సంబంధిత గ్రామాల్లోని బీఎల్‌వోల వద్ద దరఖాస్తు చేసుకోవాలని డెప్యూటీ తహసీల్దార్ అనిల్ మంగళవారం తెలిపారు.

పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

ఇబ్రహీంపట్నం: మండలంలోని సత్తక్కపల్లి, ఎర్దండి , అమ్మక్కపేట, వర్షకొండ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 108 మంది పేద విద్యార్థులకు మెట్‌పల్లికి చెందిన ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా నోట్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్‌గౌడ్, సభ్యులు , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యా సంస్థల బంద్

జగిత్యాలటౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జిల్లాలో విద్యా సంస్థల బంద్‌కు బీసీ విద్యార్థి సంఘం పిలుపునిచ్చింది. రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ బీసీ సంక్షేమ సంఘం,వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు ఈనెల 12న బుధవారం జిల్లా వ్యాప్తంగా ఇంటర్ కళాశాలలు, పాఠశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ తెలిపారు.

ధర్మపురి: విద్యారంగ సమస్యల పరిష్కారానిని ధర్మపురిలో నేడు తలపెట్టిన విద్యా సంస్థల బంద్‌కు సహకరించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జాజాల రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరాడు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో అనేక సమస్యల పరిష్కారానికి వామపక్షాలు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపు నిచ్చినట్లు పేర్కొన్నాడు.